VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 293
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
బుధవారం 8 ఏప్రిల్ 2026

# అశ్రునివాళి



కీ॥శే॥ శ్రీమతి పర్ణం నాగలక్ష్మీ గారు
చిలకలపూడి, మచిలీపట్నం

సంస్కృతీ, సాంప్రదాయాలకు పెద్ద పీట వేసి... ఎందరికో ఆదర్శంగా నిలిచిన...
మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మీ మరణం మాకు తీరనిలోటు...
మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో పదిలం... దివికేగిన మీ పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో....

## పేర్ని వెంకట్రామయ్య (నాని)
మాజీ మంత్రి
కృష్ణాజిల్లా అధ్యక్షులు : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

## పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి
మచిలీపట్నం

# అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- మత్స్యరంగానికి నూతన దిశ, మత్స్యకారులకు విస్తృత ప్రయోజనాలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (చీఖీణదీ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ప్రముఖ ఆక్వాకల్చర్ రాష్ట్రంగా ఉండటంతో అమరావతిలో పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భూమి, ప్రాథమిక మౌలిక సదు- పాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లేఖ ద్వారా తెలియజేశారని మంత్రి వెల్లడించారు. దేశంలో ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇది కీలక ముందడుగు అని, రాష్ట్ర మత్స్యరంగ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. మత్స్యకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, ఫీడ్ మేనేజ్మెంట్, వ్యాధి నియంత్రణపై శిక్షణలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయం వేగవంతంగా చేరేలా సహకరిస్తుంది. ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ఎగుమతుల రంగాల్లో సాంకేతిక మద్దతు లభించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడుతుంది. మార్కెటింగ్ అవకాశాలు విస్తరించడంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, యువతకు కొత్త ఉపాధి మార్గాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# స్వామివారికి వెండి బిస్కెట్లు అందించిన దాతలు



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న స్వయంభు దేవాలయం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఉయ్యూరు మండలం, ఆకునూరు గ్రామ వాస్తవ్యులు వెలగపూడి లక్ష్మీప్రసాద్ వెండి బిస్కెట్లు -5బరువు - 1 కేజీ విలువ ( సుమారుగా ) 3,25,000 రూపాయలు. ఆలయం డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకి మంగళవారం అందజేశారు అనంతరం దాతలకు స్వామివారి ప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# 11, 12 తేదీల్లో వాటర్ స్పోర్ట్స్ శాప్ లీగ్స్ - 2026లో భాగంగా క్రీడలు

-పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** శాప్ లీగ్స్ -- 2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీలలో విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద వాటర్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ క్రీడలకు సంబంధించిన పోస్టర్లను ఆయన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిం చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. శాప్ లీగ్స్ లో భాగంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ వాటర్ స్పోర్ట్స్ పోటీలు రాష్ట్ర స్థాయి ఈవెంట్‌గా సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బాలురు, బాలికల కేటగిరీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్‌ను కలిసిన కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని సుప్రియ, ఆమె తల్లిదండ్రులు.

**-తాడేపల్లి,కలంకౌంటర్ :**

# పాఠ్యాంశాలు నవీకరణ

-ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- కాలేజీ విద్య రీ-ఓరియెంటేషన్
- ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి
- విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకూడదు
- అవేర్ 2.0 మొబైల్ యాప్ లాంఛ్ చేసిన ముఖ్యమంత్రి






**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయాలి. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదు. ఇప్పటి వం- కు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం.. లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకో వాలి. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్దం చేయా లి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితం గా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**కాలేజ్ కరిక్యులంను రీ-స్ట్రక్చర్ చేయాలి..** "కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ-ఓరియేంటేషన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు అధ్యయనం చేయండి. యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలి. ట్రెడిషన్ కోర్సులతో పాటు... డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలి. ఈ మేరకు కరికుల్యంను రీ-స్ట్రక్చర్ చేసేలా చూడాలి. అలాగే యూనివర్శిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీతోపాటు... మిగిలిన యూనివర్శిటీలు కూడా ర్యాంకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉంది. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలి. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలి. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు చేపట్టేలా శాప్ చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు.. మరణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నివారించాలి. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పిడుగుపాటుపై మరింత అప్రమత్తత అవసరం ..** 'పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపిస్తున్నాం...అయినా అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయి. టెక్నాలజీని వినియోగిస్తున్నాం... కానీ ప్రజల్లో దానిపై అవగాహన కలిగించేలా చేయకుంటే ఏం ఉపయోగం...? ఫోన్లల్లో మెసేజీలు పెట్టడమే కాదు... క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందినీ అలెర్ట్ చేయాలి. అలాగే ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

- జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యం
- ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి
- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్







**కానూరు,కలంకౌంటర్ :** 'జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో మంగళవారం ఉదయం మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

**గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు..** ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా - ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమ- స్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం..** ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ , ముఖ్యమంత్రి మార్గదర్శకంలో నీటి పొదుపు చర్య లు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం.

**100 రోజుల ప్రణాళికకు శ్రీకారం..** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ , కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య , ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు , అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరం నియోజకవర్గంలో రూ. 34.95 కోట్ల APCRDA నిధులతో బల్లెం వారి వీధి జంక్షన్ నుండి నిడమానూరు మెయిన్ రోడ్డు వరకు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

- జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక విజయవాడ మరియు తిరుపతి నగరాలను 'గ్రేటర్' నగరాలుగా ప్రకటిస్తామని మంత్రి పి. నారాయణ వెల్లడి
- విజయవాడ రూరల్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి





**విజయవాడ,కలంకౌంటర్ :** మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 105 కోట్ల వ్యయంతో చేపట్టిన మూడు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ శంకుస్థాపన చేశారు. గన్నవరం నియోజకవర్గానికి రూ. 34.95 కోట్ల APCRDA నిధులతో బల్లెం వారి వీధి జంక్షన్ (హిస్టరీ లైన్ రోడ్) నుండి నిడమానూరు మెయిన్ రోడ్ వరకు రోడ్డు విస్తరణ, అత్యాధునిక బీటీ (హాట్ మిక్స్) రోడ్డు నిర్మాణం, సెంటర్ డిజైనింగ్, లైటింగ్ ఏర్పాట్లతో కూడిన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి స- ుభాష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని), మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ విజయవాడతో పాటు తిరుపతి నగరాలను గ్రేటర్ నగరాలుగా మార్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని, దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక విజయవాడను 'గ్రేటర్'గా ప్రకటిస్తామని తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ తన నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలం పరిధిలోని 9 గ్రామాల ప్రజలు చెత్త సేకరణ, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేవలం పైప్‌లైన్ పొడిగింపుతోనే పరిష్కారం అయ్యే తాగునీటి సమ- స్యను గత పాలకులు విస్మరించారని అన్నారు. ఈ గ్రామాలను విజయవాడ మున్సిపాలిటీలో విలీనం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన మంత్రిని కోరారు.

# పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖ

-అధునాతన ఫైర్ టెండర్ వాహనాలు, పరికరాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు





**అమరావతి,కలంకౌంటర్ :** దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఏపీకి ఉందని గుర్తు చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 ఇన్ ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను కొనుగోలు చేసింది. వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం.. వాటి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం కేంద్ర నిధులను సమర్థంగా వినియోగించుకున్నందుకు అధికారులను అభినందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ....ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతి రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని..వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. అన్ని సవాళ్ళను అధిగమించి... కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని శాఖను బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఇంటూరి అసంతృప్తి

- పర్యవేక్షణ సరిగాలేదని అధికారులపై ఆగ్రహం
- మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ పై సమీక్ష చేసిన ఎమ్మెల్యే
- ఇకనుంచి ఉదయాన్నే వార్డుల్లో పర్యటిస్తా - నాగేశ్వరరావు
- తీరు మారకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరిక



**కందుకూరు,కలంకౌంటర్ :** మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగం పనితీరు సరిగాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణ కూడా సరిగా లేదన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి ఆకస్మికంగా వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు... కమిషనర్ అనూషతోపాటు శానిటేషన్ సూపర్వైజర్లు, మేస్త్రీలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం సరిగాలేదంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొన్నిచోట్ల రోజుల తరబడి కాలువల్లో చెత్తను క్లియర్ చేయడం లేదని, మరికొన్నిచోట్ల తూతూమంత్రంగా పనిచేస్తుండడం వల్ల దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ అలాంటి పరిస్థితి ఉందో, వార్డుల వారీగా ఆయన వివరించారు. కమిషనర్ ఒక్కరే సక్రమంగా పనిచేస్తే సరిపోదని, సిబ్బంది మొత్తం బాధ్యతతో పనిచేసినప్పుడే శుభ్రమైన వాతావరణం ఏర్పడి ప్రజల హర్షిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా చెత్త పేరుకుపోయే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. దుకాణదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు రాత్రిపూట చెత్తను రోడ్లు, సైడ్ కాలవల్లో ఇష్టానుసారంగా వేస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటివారికి పారిశుధ్యంపై ఎందుకు అవగాహన కల్పించడం లేదని కమిషనర్ ను ప్రశ్నించారు. వారందరికీ అవగాహన కల్పించాలని, అప్పటికి మార్పు రాకపోతే జరిమానాలు విధించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే, వారిని వెంటనే తొలగించాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. మరో వారం రోజుల్లో మున్సిపాలిటీలో పరిస్థితి చక్కబడాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులతో అన్నారు. వారం తర్వాత ప్రతిరోజూ ఉదయాన్నే తాను కూడా స్వయంగా వార్డుల్లో పర్యటనకు వస్తానని చెప్పారు.

## మట్టి ఖర్చులకు ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ చేయుత



**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** పేదలకు చేయూతని అందించడానికి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని గౌరవాధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం రెడ్డిపాలెం పంచాయతీ భవనం వారి పాలెం గ్రామానికి చెందిన పల్లిక పాపారావు అనే కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులకు తమ ఆర్గనైజేషన్ ద్వారా తక్షణ సాయం అందించడం జరిగిందన్నారు. ఆర్గనైజేషన్ సభ్యుడు శ్రీరామ్ సునీల్ మాట్లాడుతూ వృత్తిరీత్యా బాపట్ల ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో వాచ్మేన్ గా పనిచేస్తూ ముగ్గురు పిల్లలను పోషించుకొంటూ జీవనం సాగిస్తున్నాడని ఆయన భార్య కూడా 12 సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. వారి కుటుంబానికి చేయూతను అందించడానికి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ తరుపున చిరు సహాయాన్ని అందజేశామన్నారు మరింత మంది ఆపద్బాంధవుడు ముందుకు వచ్చి వారి కుటుంబానికి చేయూతను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సువర్ణ రాజు, ఓటికొండల లక్ష్మణరావు తన్నీరు గోపి తదితరులు పాల్గొన్నారు.

## జీవనశైలి మార్పులే ఆరోగ్య సమస్యలకు కారణం

-సుఖీభవ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్.వి. రామారావు



**విజయనగరం,కలంకౌంటర్ :** కదలిక లేని, నిష్క్రియ జీవనశైలి అనేక ఆరోగ్య సమస్యలకు మరియు చిన్న వయసులోనే వచ్చే గుండెపోటులకు మూలకారణమని సుఖీభవ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్.వి. రామారావు సోమవారం తెలిపారు. ధ్యానం, యోగా మరియు నడక ద్వారా తమ ఒత్తిడిని అధిగమించడానికి కృషి చేసేవారు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలరని ఆయన పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న పాటించే 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా, వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 ఏళ్లు పైబడిన వారి కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఆయన, సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.వి. శివరామ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విజయనగరం జిల్లా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో, ఒకే విధమైన ఆలోచనా విధానం కలిగిన వైద్యులతో సుఖీభవ ఆసుపత్రిని స్థాపించినట్లు ఆయన తెలిపారు. ఆసుపత్రిలో అందించే ఆరోగ్య పరీక్షల ప్యాకేజీల అసలు విలువ రూ. 5,000 కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రజల సౌలభ్యం కోసం వాటిని కేవలం రూ. 700లకే అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 40 ఏళ్లు పైబడిన వ్యక్తులు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి, గుండె ,ఇతర కీలక అవయవాల పనితీరు గురించి అవగాహన పొందడానికి సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ శివరామ్ సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా, ఆసుపత్రిలో వైద్య పరీక్షల రుసుములను అత్యంత అందుబాటు ధరల్లోనే నిర్ణయించినట్లు డాక్టర్ శివరామ్ తెలిపారు

## సెలవుల్లో సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి - జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు,కలంకౌంటర్ :** పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా ఎస్పీ కోరారు. సరదా కోసం పిల్లలు, యువకులు గ్రామాలు, పట్టణాల శివార్లలోని కుంటలు, చెరువులు, కాలువలు, బావుల వద్దకు లేదా ఈతకు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రమాదకర జలాశయాల్లోకి వెళ్లి పలువురు మృత్యువాత పడి కుటుంబాలకు తీరని విషాదం మిగిల్చిన సంఘటనలు ఉన్నాయని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఈతకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సరదాగా వెళ్లిన పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ, వారు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత రాకపోతే కలిగే ప్రమాదాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జలాశయాలు, బావులు, కాలువలు, చెరువులు, కుంటల్లో ఈత కొట్టేముందు, ఈత తెలిసిన వారు కూడా నీటి లోతును కర్రల సాయంతో ముందుగా పరిశీలించుకోవాలన్నారు. నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటే ఈతకు వెళ్లకూడదని, విహారయాత్రలు లేదా తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల్లోనే స్నానం చేయాలని, లోపలికి వెళ్లరాదని, ఈత రాకపోయినా స్నేహితులు బలవంతం చేయకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెరువులు, కొలనులు, జలపాతాలు, నీటి కుంటలు, ఏరుల వద్దకు ఎవరూ ఈతకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. చెరువులు, బావులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నీటి లోతును తెలియజేసే సూచనలు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం సంభవించిన వెంటనే డయల్ 112 కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

## మీడియాపై దాడులు అప్రజాస్వామికం:మంత్రి కందుల దుర్గేష్

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ శ్రేణుల దాడిని ఖండించిన మంత్రి దుర్గేష్



**అమరావతి,కలంకౌంటర్ :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ శ్రేణుల దాడిని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేత వైఖరిని ప్రశ్నించినా, వారి విధానాలను విశ్లేషించినా భౌతిక దాడులకు దిగడం దుర్మార్గమని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదని స్పష్టం చేశారు. వైసీపీకి తెలిసింది కేవలం విధ్వంసం, బూతులు మాత్రమేనని.. ప్రజాస్వామ్యబద్ధంగా విమర్శలను ఎదుర్కోవడం ఆ పార్టీకి చేతకాదని విమర్శించారు. మీడియా గొంతు నొక్కడం అంటే ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా పోరాడాలి తప్ప, గూండాయిజం చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. స్వయంగా ఒక మీడియా సంస్థకు అధినేతగా ఉండి, మరో మీడియా సంస్థపై దాడులను ప్రేరేపించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. "నాలుగో స్తంభమైన మీడియాపై దాడి చేయడం అంటే ప్రజల హక్కులను కాలరాయడమే. వైసీపీ ఇప్పటికైనా తన పంథాను మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజల చేతిలో మరింత అభాసుపాలు కాక తప్పదు." అని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు.

## అకాల వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ముందు జాగ్రత్తగా ప్రజలు, రైతులకు సూచనలు చేయండి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు -- 91549 70454
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి విజయవాడ నగరపాలక సంస్థతో పాటు వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, పిడుగులు, వడగండ్ల వానలు నమోదవుతున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ శాఖలు డ్రైనేజీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడితే వెంటనే చక్కదిద్దేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బీ తదితర శాఖలు అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు స్థానిక అధికారులను వెంటనే సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ (91549 70454) ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని, పంటలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా మిర్చి రైతులను అప్రమత్తం చేయాలని కళ్లాల్లోని మిర్చిని జాగ్రత్తగా భద్రపరచుకునేలా సహాయసహకారాలు అందించాలన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ను కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు

- బార్ అసోసియేషన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ చిన్ని



**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ బార్ అసోసియేషన్ నాయకులు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైన సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ నేతృత్వంలో విజయవాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు వి లక్ష్మీనారాయణ, వీ కిరణ్ కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యులు పలువురు ఎంపీ ని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని ఇటీవల జరిగిన ఎన్నికలలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు గా అత్యధిక మెజారిటీతో గెలిచిన చలసాని అజయ్ కుమార్ తో పాటుగా విజయవాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. విజయవాడ బార్ అసోసియేషన్ తరపున ఎంపీ కేశినేని చిన్ని ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. విజయవాడ బార్ అసోసియేషన్ సమస్యలను ఎంపీ కేశినేని చిన్నికి అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు వివరించారు. బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, త్వరలోనే ఎంపీ ఫండ్స్ నుంచి నిధులను విడుదల చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. న్యాయవాదులు తెలిపిన కొన్ని సమస్యలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఆయా సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యెర్నేని వేదవ్యాస్, పిళ్ళ శ్రీనివాసరావు, బి. లెనిన్, ముష్టి శ్రీకాంత్, జి రమా తేజ, కె . ఇందిరా, ఇ. ఉషాజ్యోతి, వి. పద్మజ, చాట్ల రాజశేఖర్ ఉన్నారు.

## శాస్త్రీయ దృక్పథంతో జలధారకు ముందడుగు

- సమగ్ర డేటా విశ్లేషణతో పటిష్ట కార్యాచరణ
- పదేళ్ల గణాంకాల ఆధారంగా ప్రణాళికల రూపకల్పన
- గ్రామ, మండలం, జిల్లాస్థాయి కమిటీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత ద్వారా 100 రోజుల కార్యాచరణకు శ్రీకారంచుట్టిందని.. ఈ నేపథ్యంలో శాస్త్రీయ దృక్పథంతో జలధార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జలధారపై మంగళవారం సన్నద్ధత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెం.10కు అనుగుణంగా ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, గ్రౌండ్ వాటర్, పశుసంవర్థక, ఉద్యాన తదితర శాఖల అధికారులు ఒక బృందంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాల న్నారు. ముఖ్యంగా సూక్ష్మ సేద్యానికి జీవనాడులు అయిన చెరువుల అభివృద్ధికి తద్వారా భూగర్భ జలాల వృద్ధికి కృషిచేయాలన్నారు. జిల్లాలో దాదాపు 450 చెరువులకు సంబంధించి ప్రస్తుత స్థితి, మెరుగుపరిచేందుకు కార్యాచరణ ముఖ్యమన్నారు. పదేళ్ల గణాంకాలను విశ్లేషించుకొని పనులు చేపట్టాల్సిన ఉంటుందన్నారు. ఏప్రిల్ 15 వరకు చేపట్టాల్సిన పనుల గుర్తింపు, ఆపై పనుల మంజూరు, పనుల పూర్తి, డాక్యుమెంటేషన్ ప్రక్రియపై దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. సాగునీటి సంఘాలు, ప్రజా భాగస్వామ్యంతో జల వనరుల అభివృద్ధి, నీటి భద్రతకు కృషిచేయాలన్నారు. జులై 14 వరకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భావితరాలకు భద్రమైన నీటి వనరులను బహుమతిగా ఇచ్చే ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా చెరువులు-కాలువల పునరుద్ధరణ, చెరువుల అనుసంధానం, నీటి సంరక్షణ విధానాలు, పచ్చదనం పెంపొందించడం, గ్రామ నీటి బడ్జెట్ లక్ష్యాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా నీటి వనరుల అధికారి (డీడబ్ల్యూఆర్వో) పి.రామచంద్రరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డి.బాలశంకర్‌రావు, జిల్లా పశు సంవర్థక అధికారి డా. ఎం.హనుమంతరావు, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఇరిగేషన్‌తో పాటు వివిధ సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగింపు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగించడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి కందులు (రెడ్ గ్రామ్/తూర్) కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో ధర మద్దతు పథకం (పీఎస్‌ఎస్) కింద కొనుగోలు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, మే 4 వరకు పొడిగింపునకు ఆమోదం తెలిపిందన్నారు. రైతులు తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునేలా చూడటం కూటమి ప్రభుత్వ బాధ్యత. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తోంది. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అన్ని అంశాల్లో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తాము అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# పారదర్శకంగా వ్యవహరించాలని వినతి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా వ్యాప్తంగా సామాన్య ప్రజలకు వంట గ్యాస్ కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబుకు బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వంట గ్యాస్ డెలివరీ ఆలస్యం అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. గ్యాస్ డెలివరీ అయిన 30 రోజుల తర్వాత బుకింగ్ చేసుకున్న వారికి సైతం డెలివరీకి 10 నుంచి 15 రోజులు అవుతున్నప్పటికీ వంట గ్యాస్ అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు బుక్ చేసుకున్నప్పటికీ ఆలస్యం అవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా టోల్ ఫ్రీ నెంబర్లకు సంబంధిత సమస్యను తెలియపరచడానికి కాల్ చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. వంట గ్యాస్ డెలివరీ జాప్యం వల్ల ప్రజలు తమ పనులను మానుకుని ఎండలో బారులు తీరి గ్యాస్ కంపెనీల వద్ద పడుతున్న ఇబ్బంది వర్ణనాతీతమన్నారు. అలాగే కమర్షియల్ బండలను నిలిపివేసినప్పటికీ హోటలలో గృహ అవసరాలకు వినియోగించె గ్యాస్ బండలు దర్శనం ఇవ్వడం బాధాకరమన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.కాబట్టి వంట గ్యాస్ సకాలంలో అందించడమే కాకుండా టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సరైన స్పష్టతను ప్రజలకు అందించి ఆదుకోవాలని బి.సి సంక్షేమ సంఘం తరఫున డి.ఎస్.ఓ మోహన్ బాబు కు వినతి పత్రం సమర్పించినట్లుగా సుబ్రమణ్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివ, భోగి రెడ్డి స-ంభాని, నిక్కు రాధాకృష్ణ, ఎన్. అన్సారి, బెల్లంకొండ రవి, పి.సాంబయ్య, చేబోయిన కోటయ్య తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యాచరణ
- కాలువలు, చెరువుల్లో పూడికతీతలు, మరమ్మతులు
- ప్రతి ఎకరాకూ నీరందిస్తాం
- నీటి బొట్టుతో సంపద సృష్టి.. ఇదే చంద్రబాబు లక్ష్యం
- అమరావతిపై విషం కక్కుతున్న జగన్
- ఇది తప్పు అన్నందుకు పెట్రేగిపోతున్న జగన్ బ్యాచ్
- మీడియా సంస్థలు, ప్రజలపై వైసీపీ దాడులు గర్హనీయం
- చూస్తూ ఊరుకునేది లేదు : మంత్రి సవిత హెచ్చరిక
- శ్రీసత్యసాయి జిల్లా చాలకూరులో జలధార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత
- మహిళా రైతు కూలీలతో కలిసి వేరుశనగ పంటను వెలికితీసిన మంత్రి సవిత

**సోమందేపల్లి/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** నీటితోనే సంపద సృష్టించొచ్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకనే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో కలిసి వంద రోజుల ప్రణాళికలను రూపొందించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామం సమీపంలోని చెరువులో సోమవారం ఏర్పాటు చేసిన జలధార కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణకు 100 రోజుల పాటు జలధార ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీతలతో పాటు మరమ్మతులు, ఇంకుడు గుంతలు తవ్వుతామన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంచడం, తక్కువ నీటితో ఎక్కువ పంట పండించే విధానాన్ని (డ్రిప్ ఇరిగేషన్) ప్రోత్సహించడం, చెరువుల్లోని మట్టిని పొలాలకు తరలించడం, పంట కుంటల నిర్మించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నీటి సంరక్షణను ఉద్యమం చేపట్టామని, రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ ఉద్యమం చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు.





**పెట్రేగిపోతున్న వైసీపీ బ్యాచ్..** అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడం, ఆ వెంటనే రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో జగన్, ఆయన పార్టీ నేతలు సహించలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మావిగన్ అంటూ అమరావతిపై జగన్ మరోసారి విషం కక్కార న్నారు. రాజధానిపై పూటకో మాట, గంటకో మాట ఆడుతుండ డంతో ప్రజలు జగన్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నాం న్నారు. అమరావతిపై కుట్రలు పన్నడం తప్పు అని చెప్పడంతో, వైసీపీ బ్యాచ్ సహించలేకపోతోం దన్నారు. మీడియా సంస్థ లపైనా, ప్రజలపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందేపోయి, జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు.

**వేరుశెనగ రైతులతో ముచ్చట..** జలధార కార్యక్రమం అనంతరం చెరువు పక్కనే ఉన్న వేరు శనగ పంట భూములను మంత్రి సవిత పరిశీలించారు. ఎంతమేర సాగు చేశారు... పంట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస ్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నారన్నారు. రూ.30 వేల కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని, రాయసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వెచ్చిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు సంతృప్తి వక్తంచేయడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలు వురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రుషికొండ భవనాల వినియోగంపై నివేదిక సిద్ధం

**అమరావతి,కలంకౌంటర్ :** విశాఖ రుషికొండ భవనాల వినియోగంపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తమ అధ్యయన తుది నివేదికను సిద్ధం చేసింది. సచివాలయంలోని మంత్రి కందుల దుర్గేశ్ కార్యాలయంలో సబ్ కమిటీ ఐదోసారి భేటీ అయ్యింది. మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి వర్చువల్గా హాజరయ్యారు. గత నాలుగు భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించిన మంత్రులు.. పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై తుది నివేదిక సిద్ధం చేశారు. రుషికొండ ప్యాలెసను ప్రజల



సందర్శనకు అనుమతించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయి. ఈ భవనాల నిర్వహణకు తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి చూపుతున్నదృష్ట్యా.. వాటికి అవకాశం కల్పించే అంశంపై కమిటీ చర్చించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, రాష్ట్ర కేబినెట్లో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేశ్ తెలిపారు.






Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com